# చైనీస్ పజిల్




MVS PUBLICATIONS

మధుబాబు

# చైనీస్ పజిల్

(షాడో స్పై థ్రిల్లర్)

రచన

మధుబాబు

© Author
© Madhu Baabu
This digital book is published by -

కినిగె డిజిటల్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్.

సర్వ హక్కులూ రక్షించబడ్డాయి

*All rights reserved.*

*No part of this publication may be reproduced, stored in a retrieval system or transmitted in any form or by any means electronic, mechanical, photocopying, recording or otherwise, without the prior written permission of the author. Violators risk criminal prosecution, imprisonment and or severe penalties.*

# చైనీస్ పజిల్

"కూలీ సార్... కూలీ... రెండు అమెరికన్ డాలర్లు యిస్తే చాలు. ఎక్కువ అక్కర్లేదు." అంటూ షాడో చేతిలో వున్న ఎయిర్ బేగ్‌ని గట్టిగా పట్టుకున్నాడు తుమ్మ మొద్దులా, నల్లగా, దృఢంగా వున్న ఒక ఎయిర్ పోర్ట్ కూలీ.

అప్పుడే విమానం దిగి, కస్టమ్స్ అధికారుల మధ్యలో నుంచి యివతలికి వస్తున్నాడు షాడో. ఉన్నట్లుండి ఎదురైన ఆ కూలీని చూసి వులిక్కిపడ్డాడు అప్రయత్నంగా.

"ఎందుకు సార్ అలా వులిక్కి పడతారు? నేను అడిగింది రెండే రెండు డాలర్లు. రెండు లక్షలు కాదు." అంటూ అతని సమాధానం కోసం ఎదురు చూడకుండా, ఎయిర్ బేగ్‌ని వూడలాక్కుని పరుగులాంటి నడకతో ఎయిర్‌పోర్ట్ ఎంట్రన్స్ వైపుబయలుదేరాడు ఆ కూలి.

అదిరిపోయాడు షాడో. ఒక్క క్షణంపాటు ఏం చేయాలో అతనికి తోచలేదు. ఆ ఎయిర్ బేగ్ క్రింది భాగంలో చిన్న సీక్రెట్ కంపార్ట్‌మెంట్ వుంది. అతని ఆయుధాలు, అవసరానికి వుపయోగించే యితర పరికరాలు అన్నీ ఆ కంపార్ట్‌మెంట్ లోనే వున్నాయి. కస్టమ్స్ అధికారులు వాటిని గమనించలేదు. ఇప్పుడు యీ కూలీ మూలకంగా ఏదైనాగోల జరిగి, వాళ్ళకు అనుమానం వచ్చి...

ఆపైన ఆలోచించటానికి మనస్కరించక బాణంలా ఆ కూలీ వెనుక పరుగు తీశాడతను. రెండు క్షణాల తరువాత అతన్ని సమీపించి మెడ పట్టుకొని కదలకుండా నిలబెట్టేశాడు.

"మీరు మెడ పట్టుకున్నా, కాళ్ళు పట్టుకున్నా ప్రయోజనం ఏమీ లేదు సార్... ఇవాళ నేను యీ బేగ్‌ని మోసి తీరాల్సిందే." పట్టుదలగా అన్నాడు ఆ కూలీ పళ్ళన్నీ కనిపించేటట్లు నవ్వుతూ.

"మై గాడ్! నువ్వు కూలీవా లేక బందిపోటు దొంగవా?" ఆశ్చర్యంగా అడిగాడు షాడో.

"బందిపోటు దొంగలు ఎవరో కొంచెం వెనక్కి తిరిగి చూసుకుంటే తెలుస్తుంది సార్... ఏదో కడుపు నింపుకోవటానికి యిలా వచ్చాం మేము. ఎయిర్ పోర్ట్‌లో నీడలు అడుగు పెట్టేదాకా యిక్కడే వుంటాం..."

ఎలా వున్నవాడు అలాగే శిలా విగ్రహంలా బిగుసుకుపోయాడు షాడో ఆ మాటల్ని వినగానే. ఇంటర్‌పోల్ డిటెక్టివ్‌లు వుపయోగించే కోడ్ వర్డ్ అది... కూలీల వేషంలో తన కోసం ఎదురుచూస్తున్నారన్న మాట అనేక మంది డిటెక్టివ్‌లు... ఎంతో అవసరం అయితే తప్ప అలా గుంపుగా బయలుదేరరు వాళ్ళు...

తన ముఖంలో ఎటువంటి భావాలు పొడచూపకుండా జాగ్రత్తలు తీసుకున్నాడు షాడో. "ఆల్ రైట్‌బ్రదర్... అంత్య నిష్ఠూరం కంటె ఆది నిష్ఠూరం చాలా మంచిది. ఏం జరిగింది? ఎస్సైన్మెంట్ ప్రారంభం కాక ముందే ఏమిటి యీ అపశకునం?" పాంటు జేబులో వున్న పనామా పాకెట్‌ని తీసి సిగరెట్ వెలిగించుకుంటూ అడిగాడు.

"మామూలు అపశకునం అయితే ఫర్వాలేదు మిస్టర్ షాడో... కథ పూర్తిగా అడ్డం తిరిగింది. ఇక్కడ వుండే మన మనిషిని శత్రువులు పని కట్టేశారు. రాత్రింపగళ్ళు అతని యింటిచుట్టూ బలమైన కాపలా పెట్టబడింది. అతనికి, మనకి కనెక్షన్స్ తెగిపోయాయి. నువ్వు ఎట్టి పరిస్థితిలోను అతన్ని కలుసుకోకూడదు." అంటూ

ఎయిర్ బేగ్ ని భుజం మీద వేసుకొని మళ్ళీ ఎంట్రన్స్ వైపు పరుగు మొదలుపెట్టాడు ఆ కూలీ.

"సగం చెప్పి వదిలేయటం ఏమీ బాగోలేదు బ్రదర్... అసలు ఏం జరిగిందో వివరంగా చెప్పు." అంటూ అతని వెనుకే పరుగు తీశాడు షాడో.

అతని మాటలకు సమాధానం యివ్వకుండా సూటిగా టాక్సీ స్టాండ్ దగ్గరికి పోయి ఎయిర్ బేగ్ ని ఒక టాక్సీలోకి విసిరేశాడు ఆ కూలీ.

ఇక నన్ను ఏమీ అడగొద్దు బ్రదర్. నా డ్యూటీ అయిపోయింది. నా రెండు డాలర్లు నా ముఖాన పడేస్తే నేను పోతాను." అంటూ చేయి జాచాడు.

"ఆఫ్టరాల్ ఒక ఎయిర్ బేగ్ ని మోయటానికి రెండు డాలర్లు కావాలా?" నువ్వు అరిచి పీక్కున్నా సరే ఒకటి కంటె ఎక్కువ యివ్వను." కోపంగా అన్నాడు షాడో.

ముఖం మీద ఎవరో లాగిపెట్టి గుద్దినట్లు ఎగిరి గంతులు వేశాడు ఆ కూలీ.

"నన్ను అన్యాయం చేస్తున్నాడు... ఇండియా నుంచి వచ్చిన యీ దుర్మార్గుడు. నా నోటి ముందున్న కూటిని పడగొడుతున్నాడు... రండిరోయ్... నను కాపాడండిరోయ్." అని పోలీస్ సైరన్ మాదిరి అరుస్తూ ఆ చుట్టుపట్ల వున్న కూలీలనందర్నీ పిలవటం మొదలుపెట్టాడు.

ఇక ఆలస్యం చేస్తే మర్యాద దక్కదని గ్రహించాడు షాడో.

"నిన్ను ఇంటర్ పోల్ లోకి రిక్రూట్ చేసింది ఎవరో కాని, నీకు సరిపోయిన వేషం వేశారు. ఇంతకు ముందు కూడా యీ కూలీ పనే చేస్తూవుండే వాడివా?" అంటూ వాలెట్ తీసి రెండు డాలర్ల నోటు నొకదాన్ని అతని ముఖం మీదికి విసిరాడు.

తక్కున నోరు మూసుకొని ఆ నోటును అందుకున్నాడు కూలీ. పళ్ళన్నీ కనపడేటట్లు పెద్దగా నవ్వి ఎయిర్‌పోర్టులోకి వెళ్ళిపోయాడు.

బ్రతుకు జీవుడా అనుకుంటూ టాక్సీలో కూర్చున్నాడు షాడో.

"హోటల్ త్రీ డైమండ్స్‌కి పోనీ" అని డ్రయివర్‌కి చెప్పి, రోడ్డుమీద తిరుగుతున్న జకార్తా పౌరుల్ని కుతూహలంగా గమనించసాగాడు.

అడ్డు వచ్చిన వాహనాలను హారన్ మ్రోతలతో చెల్లాచెదురు చేస్తూ వేగంగా ప్రయాణం ప్రారంభించింది అతనెక్కిన టాక్సీ. దానికంటే వేగంగా పరుగులు తీస్తున్నాయి షాడో మనసులోని ఆలోచనలు.

జకార్తాలో అడుగు పెట్టగానే ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా ఇంటర్‌పోల్ డిటెక్టివ్ లాంబ్రిటోని కలుసుకోవాలని అతనికి ఆర్డర్లు యివ్వబడ్డాయి. ఎస్సైన్మెంట్‌కి సంబంధించిన వివరాలన్నీ లాంబ్రీటో దగ్గరే లభిస్తాయట... అతన్ని కలుసుకోకపోతే అంతా గల్లంతు అయిందన్న మాటే...

ఉన్నట్లుండి సడన్ బ్రేకుతో ఆగింది టాక్సీ. ఆ అదటుకు ముందుకు తూలబోయి ఆఖరి క్షణంలో నేర్పుగా సీటును పట్టుకొని బాలెన్స్ సరి చేసుకున్నాడు షాడో.

"తొందరగా దిగండి సార్... హోటల్ వచ్చేసింది..." ఇంజన్‌ని ఆఫ్ చేసి క్రిందికి దిగుతూ అన్నాడు టాక్సీ డ్రయివర్.

ఎయిర్‌పోర్టుకి ఆరు మైళ్ళ దూరంలో వుంటుంది త్రీ డైమండ్స్ హోటల్. అంత త్వరగా తీసుకొచ్చినందుకు అతన్ని అభినందించాలని అనుకుంటూ, ఎదురుగా కనిపించిన హోటల్ పేరును చూసి ఆశ్చర్యపోయాడు షాడో.

త్రీ డైమండ్స్ హోటల్ కాదది. మిడిల్ క్లాస్ యాత్రికులు బస చేసే చౌకబారు లాడ్జి.

"వాటీజ్ దిస్ నాన్సెన్స్? నేను నీకు చెప్పింది ఏమిటి?" నొసలు ముడివేస్తూ డ్రయివర్‌ని అడిగాడు.

ఆ మాటలు తనకు వినిపించనట్లు డోర్ తెరిచి పట్టుకున్నాడు డ్రయివర్.

"మర్యాదగా టాక్సీని ముందుకు పోనిస్తావా లేక ముఖం పగల గొట్టమంటావా?" పిడికిళ్ళు బిగించి సీటులో నుంచి లేస్తూ, వేడిగా అన్నాడు షాడో.

"సారీ సర్... ఎయిర్ పోర్టులో అడుగుపెట్టిన నీడను సురక్షిత స్థలానికి చేర్చమని నాకు ఆర్డర్లు వచ్చాయి. ఈ హోటల్ మనదే..." శిలా విగ్రహంలా నిలబడి లోగొంతుకతో అన్నాడు టాక్సీ డ్రయివర్.

శరీరంలో వున్న శక్తి అంతా ఆవిరి అయిపోయినట్లు నీరసంగా సీటు వెనక్కి వాలిపోయాడు షాడో. భల్లూకాల వంటి వాళ్ళు ఇంటర్‌పోల్ డిటెక్టివ్ లు. పట్టిన పట్టును ఒక పట్టాన వదలరు.

"అసలు ఏం జరిగిందో నువ్వైనా చెప్పు బ్రదర్... ముసుగులో గుద్దులాటలు నాకు ఎంతమాత్రమూ నచ్చవు." ఎయిర్ బేగ్‌ని భుజానికి తగిలించుకొని క్రిందికి దిగుతూ అడిగాడు.

"లాంబ్రిటో వ్యవహారం చాలా ఖండాలంగా తయారయింది మిస్టర్ షాడో. అతన్ని కలుసుకోవటానికి నువ్వు వస్తున్నట్లు శత్రువులకు తెలిసిపోయింది. అతనితోపాటు నిన్ను కూడా ఖతమ్ చేయటానికి వాళ్ళు రెడీగా వున్నారు. నువ్వు

ఎట్టి పరిస్థితిలోను లాంబ్రిటో సమీపంలోకి పోకూడదు. నా టాక్సీ ఫేర్ నాకు యిచ్చేస్తే నేను వెళ్ళిపోతాను." అన్నాడు టాక్సీ డ్రయివర్ డోర్ మూసి చేయి జాస్తూ.

మారు మాట్లాడకుండా ఒక కరెన్సీ నోటును అతనికి అందించి హోటల్లోకి పోయాడు షాడో. డ్రయివర్ అన్న మాటల్లో అసత్యం ఏమీ లేదని వెంటనే తెలిసిపోయిందతనికి. మేనేజర్ దగ్గర్నుంచి, సామాన్లు మోసే రూమ్ బాయ్ దాకా అక్కడి వారందరూ ఇంటర్‌పోల్ మనుష్యులే.

ఎయిర్ బేగ్‌ని తన కోసం వాళ్ళు రెడీ చేసిన గదిలో వదిలి, మళ్ళీ రోడ్డు మీదకు వచ్చాడు.

". . . ప్రపంచ శాంతి భద్రతలు యీ ఎస్సైన్మెంట్ మీద ఆధారపడి వున్నాయి రాజూ... ఏమాత్రం ఆలస్యం చేసినా శత్రువుల చేయి పైకిపోతుంది. నువ్వు త్వరగా జకార్తా పోయి లాంబ్రిటోని కలుసుకుంటే అంత మంచిది "అంటూ తొందరపెట్టి విమానం ఎక్కే దాకా వెంటపడి తరిమారు ఇంటర్‌పోల్ డైరెక్టర్లు.

పడుతూ లేస్తూ జకార్తా పరిగెత్తుకు వచ్చాడు తను. వచ్చిన మరుక్షణం నుంచీ ముందుకు పోవద్దని అడుగు అడుగుకూ అడ్డంపడి ఆపుతున్నారు ఇంటర్‌పోల్ డిటెక్టివ్‌లు.

గాఢంగా నిట్టూర్చి ఒక సిగరెట్ వెలిగించుకొన్నాడు షాడో. తను బసచేసిన లాడ్జికి రెండు ఫర్లాంగుల దూరం పోయి, అక్కడ కనిపించ ఒక చిన్న టీ బంక్ లోపలికి పోయి టీకి ఆర్డర్ యిచ్చాడు.

అతని చేతలతో తనకేం నిమిత్తం లేనట్లు అంతకు ముందు రోజు జరిగిన సంఘటనల్ని నెమరు వేసుకుంటూనే వుంది అతని అంతరంగం.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=498**